"అమ్మగారూ! నేను తీయలేదండీ'' అంది భాగ్యం ఏడుస్తూ. కళ్యాణీ వాళ్లింట్లో పని పిల్ల భాగ్యం.

"నోర్ముయ్! తీసింది చాలక పైగా అబద్ధాలు కూడానా. నువ్వే కదా నిన్న సాయంత్రం వచ్చి ఆ రూమ్ తుడిచావ్. ఏమైపోతుంది నా వాచీ, ఉంగరం ఇంతలో'' అంటూ అరచి భాగ్యం చెంపపై ఓ దెబ్బ వేసింది కోపంగా.

"నాకేం తెలీదు. భగవంతుడి సాయిగా నన్ను నమ్మండి అమ్మా'' అంది మండుతున్న చెంపపై రాసుకుంటూ.

"మీ అమ్మని ఊర్నించి రానీ నీ పని చెప్తాను. దొంగకూతురిని నా ఇంటిలో ఉంచి వెళ్లింది'' అని విసుక్కుని-

"పో...పోయి ఆ గిన్నెలవీ కడిగి వెళ్ళిపోయేటప్పుడు నీ పరికిణీ, ఓణీలవీ చూపించి వెళ్ళు'' అంది కళ్యాణి.

భాగ్యం ఏడుస్తూ, ఓణీ కొంగుతో కళ్ళు తుడుచుకుంటూ కిచెన్‌లోకి వెళ్లింది గిన్నెలు కడగడానికి.

"అబ్బబ్బ ఎవరు ఎలాంటివారో తెలుసుకోలేక పోతున్నాం ఈరోజుల్లో. లేకి మనుషులు, లేకి బుద్ధులు వీళ్ళూను'' అనుకుంటూ పక్క బల్లపై ఉన్న మేగజైన్ అందుకుని తిరగేయసాగింది.

"అమ్మగారూ గిన్నెలు కడిగాను నే వెళ్ళ వచ్చా?'' అంది భాగ్యం భయం భయంగా చూస్తూ.

"ఏదీ! ఆ పరికిణీ దింపు, ఆ ఓణీ తీయి'' అంటూ దాన్ని పరీక్షించి "వెళ్ళు'' అంది కోపంగా.

భయంగా బయటకు నడవబోయిన భాగ్యాన్ని "ఆఁ ఇదిగో ఆ వాచీ ఉంగరం దొరక్కపోతే నీమీద పోలీస్ కంప్లయింట్ ఇస్తాను'' అంటూ

"ఇక వెళ్ళు'' అంటూ ఉరిమింది కళ్యాణి.

భయంగా తల ఊపి 'బతుకుజీవుడా' అనుకుంటూ అక్కడినించి బయటకు వెళ్లింది భాగ్యం.

* * *

ఆ రాత్రి పడుకోబోతున్న కళ్యాణితో "నీకో విషయం చెప్పాలోయ్'' అన్నాడు భర్త రమేష్.

"ఏమిటో చెప్పండి'' అంది ఆవలిస్తూ.

"నీవు వాచీ, ఉంగరం భాగ్యం తీసింది అని అనుమానిస్తున్నావ్ కానీ ఆ పని చేసింది నీ పుత్రరత్నం'' అన్నాడు.


"ఏమిటి మీరు అనేది. నా కొడుకుని అనుమానిస్తున్నారా? వాడు అలాంటిపనులు చేయడు'' అంది ఎంతో నమ్మకంగా.

"అదే మరి. నీ కొడుకు కాబట్టి అంత నమ్మకంగా చెప్పావ్. అదే మనింట్లో పనిపిల్ల కాబట్టి నేరం దాని మీదకి నెట్టావ్ నిజానిజాలు తెలీక'' అన్నాడు.

"ఆహా! మీకేంటిట తెలిసిన నిజం'' అంది కోపంగా.

"అదే చెబుతున్నాను. సాయంత్రం నేను పని మీద బజారుకి వెళ్లాను కదా. అప్పుడు మనం అప్పుడప్పుడు వెళ్తుంటాం ఆ బంగారం షాపు అక్కడికి నీ కొడుకు వెళ్ళి వాచీ, ఉంగరం ఇచ్చి నాల్గైదు వందలు కావాలని, నీవు తెమ్మన్నావని చెప్పి తీసుకున్నాడు. నీకంత అర్జంట్‌గా డబ్బు అవసరం ఏం వచ్చిందో?'' అన్నాడు.

# అనుమానం



## -కె.భానుమతి

"ఏమిటి నేను తెమ్మన్నానా?'' అంది ఆశ్చర్యంగా.

"నీలానే నేను ఆశ్చర్యపోయాను. కానీ తెలివిగా తప్పించుకుని ఏదో చెప్పి ఆ డబ్బు ఇచ్చి నీ సరుకులు తెచ్చాను చూడు అవి నా షర్ట్ జేబులో ఉన్నాయి. ఇందాకనే చెబుదాం అనుకున్నాను కానీ నీవు ఆవేశంలో ఉన్నావని తరువాత చెప్పవచ్చు అని ఊరుకున్నాను'' అంటూ అటు తిరిగి పడుకున్నాడు.

"వెధవ ఎందుకు చేశాడు ఇలా?'' అనుకుంటూ ఎప్పటికో పడుకుంది.

* * *

మర్నాడు భాగ్యం తల్లి వచ్చి "ఏడుస్తూ ఏంటమ్మా కళ్యాణిగారూ! మా పిల్ల ఏదో తీసిందని కేకలేశారట''అంది.

"ఆఁ వాచీ, ఉంగరం కనిపించలేదే. అందుకని తీసిందేమో అని అడిగాను. కానీ అవి చీరలకిందకి వెళ్ళిపోయాయి. కనిపించలేదు! అందుకే అడిగాను. ఉన్నాయిలే. వెళ్ళి పని చూసుకో'' అంది ముభావంగా.

"పోనీలేమ్మా. మీ వస్తువులు దొరికాయి. మా పిల్ల తీయలేదని తెలిసింది. చాలు'' అంది ఆనందంగా.

"ఆఁ ఆఁ వెళ్లి పని చూసుకో'' అంది కొడుకు చేసిన దొంగతనాన్ని మనసులో దాచేసుకున్న కళ్యాణి మొహం చాటుచేసుకుని.

★